ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

సారపాక, ఆగస్టు 12: బూర్గంపహాడ్ మండలం మోతే పట్టీనగర్‌లో 1500 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయ కాలం నాటి శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి పురాతన ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి తీర్చిదిద్దాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కిన్నెరసాని వద్ద ఎమ్మెల్యే పాయం కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మంత్రి మోతే వీరభద్రుని ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

మొక్కలు నాటుతున్న వాణీవిద్యానికేతన్ విద్యార్థులు

చర్ల, ఆగస్టు 12: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుదామని, పర్యావరణాన్ని కాపాడుదామని శ్రీవాణి విద్యానికేతన్ హెచ్ఎం మైనేని పద్మజ అన్నారు. సోమవారం విద్యార్థులతో కలిసి చర్లలోని రహదారుల ప్రక్కన, పాఠశాల ఆవరణలో 50 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందరి ప్రశంసలు అందుకున్న జిల్లా కళాకారులు

కళాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, ఆగస్టు 12: ఇటీవల హైదరాబాద్ రవీంద్ర భారతి కళావేదికగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారి సహకారంతో తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రజాకళల పండుగ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కళాకారులు కొండలరావు అధ్యక్షతన జానపద పాటలు, నృత్యాలు ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. ఎస్‌కే బాషా, రాము, రామకృష్ణ, కృష్ణ, రాంబాబు, కొమరయ్య, డాన్స్ మాస్టర్ శ్యాంలు ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా, రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 12: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

ఆళ్ళపల్లి, ఆగస్టు 12: మండల పరిధిలోని అనంతోగు కేజీబీవీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని పాఠశాల ఎస్‌వో పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మృతిచెందిన సమగ్రశిక్ష ఉద్యోగులకు సోమవారం పాఠశాల ఆవరణలో నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలను పరిష్కరించపోతే సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. యంఐఎస్, సీసీవో, సీఆర్‌పీఎస్, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరెంట్ కోసం లైన్‌మెన్ నిలదీసిన గ్రామస్తులు

టేకులపల్లి, ఆగస్టు 12: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు గ్రామంలో మూడు రోజులుగా కరెంటు సరిగా ఉండడంలేదని సోమవారం రాత్రి గ్రామానికి వచ్చిన లైన్‌మెన్‌ను గ్రామస్తులు నిలదీశారు. కరెంటు సరిగా ఉండట్లేదని, వచ్చినా వెంటనే పోతుందని నిలదీయడంతో గ్రామస్తులకు, లైన్‌మెన్‌కు వాగ్వాదం జరిగింది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామాని గ్రామస్తులు తెలిపారు.

గ్రామీణ వైద్యులు అర్హతకు మించి వైద్యం చేయొద్దు

సారపాక, ఆగస్టు 12: మండలంలో గ్రామీణ వైద్యులు అర్హతకు మించి వైద్యం చేయొద్దని జిల్లా డీఈఎంవో ఫియాజుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని మోరంపల్లి బంజర్ పీహెచ్‌సీలో సోమవారం వైద్యాధికారి లక్ష్మిసాహితీ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఎంవో మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఆర్ఎంపీ, పీఎంపీలు తమ పరిధికిలోబడి వైద్యం చేయాలని, నిబంధనలు అతిక్రమించి వైద్యం అందిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవగాహన కార్యక్రమంలో సీహెచ్‌వో బి.సోమ్లా, ఎస్‌యూవో బి.జీతు, హెచ్‌ఈవో బి.రవి, ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 12: పట్టణంలోని ప్రగతిమైదాన్‌లో గురువారం పంద్రాగస్టు వేడుకలు అధికారికంగా జరుగనున్నాయి. ప్రగతి మైదాన్‌లో జరుగుతున్న పనులను సోమవారం కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య పరిశీలించారు. అవసరమైన సలహాలు, సూచనలు సిబ్బందికి చేశారు. ఆయన వెంట ఆర్ఐలు నరసింహారావు, అలీం, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మాదక ద్రవ్యాలు సేవిస్తే కఠిన చర్యలు

గంజాయి సేవించిన ఐదుగురి అరెస్ట్
డీఎస్పీ రహమాన్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 12: మాదక ద్రవ్యాలు సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ షేక్ అబ్దుల్ రహమాన్ హెచ్చరించారు. గంజాయి సేవించిన ఐదుగురు యువకులను గుర్తించిన వన్‌టౌన్ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తన సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని శేషగిరినగర్ కాలనీకి చెందిన రావులపెంట మోహన్ కృష్ణగా పోలీసులు గుర్తించారు. సదరు యువకుడి వద్ద నుంచి 6.6 కిలోల గంజాయిని స్వాధీనపరుచుకున్నారు. ఈ విచారణలో మోహన్ కృష్ణ ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు మండలం నుంచి ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి కొత్తగూడెంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. మోహన్ కృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు బెల్లంకొండ ప్రేమ్‌కుమార్, ఎండీ అమన్, ఎస్‌కే సాదిక్ పాషా, జంగిలి రేవంత్, కంచం సందీప్‌కుమార్‌ను పరీక్షించి, గంజాయి తాగినట్లు నిర్ధారణ కావడంతో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రెహమాన్ వెల్లడించారు. వీరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, ఎస్సై విజయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడితే వదిలేది లేదు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాలపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపుతుందని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గంజాయి రవాణా, క్రయ, విక్రయాలతో పాటు సేవించేవారిపై సైతం పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి నిర్మూలనలో భాగంగా ప్రత్యేకంగా డ్రగ్స్ డిటెక్టర్ డాగ్‌ని ఏర్పాటు చేశామని, జాగిలంతో నిత్యం అన్ని ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి మాదక ద్రవ్యాలను గుర్తిస్తామని తెలిపారు. గంజాయి సేవించే వారిపై సైతం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సింగరేణి లాభాల వాటా సాధించిన ఘనత మహేంద్రదే..

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మహేంద్ర చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 12: సింగరేణి కార్మిక వర్గానికి లాభాల వాటా సాధించి పెట్టిన ఘనత కేఎల్ మహేంద్రదేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎల్ మహేంద్ర వర్ధంతిని శేషగిరి భవన్‌లో నిర్వహించారు. ముందుగా మహేంద్ర చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. సాబీర్‌పాషా, దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, వీరసేఖ్వామి, నగేష్, రాములు, గట్టయ్య, మాతంగి లింగయ్య, అన్యం లక్ష్మీనారాయణ, యూసుఫ్, జహీర్, నగేశ్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు మారుపేరు 'సురేష్‌బాబు'

ప్రజా సేవకు మారుపేరని వట్టికొండ సురేశ్‌బాబు అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కమ్మవారి సత్రంలో జరగిన సంతాపసభలో సురేష్‌బాబు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు.

మందుపాతర పేలి మహిళ దుర్మరణం

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 12 : ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోయిస్టులు భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ అమర్చిన మందుపాతర పేలడంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. దబ్బమర్క గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కవాసి సుక్కీ రోజు మాదిరిగానే మేకలు కాసేందుకు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లింది. ఈ క్రమంలో అక్కడ భద్రతా బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై సుక్కీ కాలు వేయడంతో అది భారీ విస్ఫోటనం చెందింది. దీంతో సుక్కీ రెండు కాళ్లతోపాటు కుడి చేయి తెగిపోయి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న భద్రతా దళాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులను టార్గెట్ చేస్తూ అమర్చిన మందుపాతర పేలడం వల్లే సదరు ఆదివాసీ మహిళ మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం సమీప అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల జాడ కోసం జల్లెడ పడుతోంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషాద ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలి

అశ్వాపురం, ఆగస్టు 12: సీతారామ ప్రాజెక్టు నీళ్లు స్థానిక పొలాలకు పారించిన తర్వాతే ఖమ్మం జిల్లాకు తరలించాలని, లేనిపక్షంలో బీజీ కొత్తూరు పంపుహౌస్ వద్ద నీటి విడుదలను అడ్డుకుంటామని మొండింకుట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి సోమవారం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా 16వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసి మొదటి దశలో 25 కోట్లు చేసి శంకుస్థాపన చేసిన మార్లెళ్ల పాడు ప్రాజెక్టును ఆపి ఈ ప్రాంత రైతాంగాన్ని విస్మరించడం సరైన పద్ధతికాదన్నారు. జిల్లా ఆయకట్టు మొత్తానికి సీతారామ నీళ్లతో స్థిరీకరించాలని, లేనిపక్షంలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

అంత్యక్రియలకు సాయం

బూర్గంపహాడ్, ఆగస్టు 12: ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం పొలిపాక గ్రామానికి చెందిన పుట్టి అర్జునరావు మృతిచెందగా దహన సంస్కారాలకు జిల్లా ఆర్య వైశ్య మహాసభ 2022-23 అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయుడు గుడుమాసు వెంకట సత్యనారాయణ, చారుగుళ్ల పద్మావెంకటరమణ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

దుమ్ముగూడెం: ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

దుమ్ముగూడెం, ఆగస్టు 12: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సోమవారం ఒకరోజు సమ్మె నిర్వహించారు. సమ్మె శిబిరంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి పద్మ పాల్గొని మద్దతు పలికారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీవో రామకృష్ణకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. అర్హులైన వారిని కార్యదర్శులుగా నియమించాలని, జీవో 51ని సవరించాలని, విధినిర్వహణలో మృతిచెందిన కార్మికులకు రూ.10లక్షలు పరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి నరేశ్, కన్నయ్య, వెంకటేశ్, భవానీ, రేవతి, జానకి, కారం వెంకటేష్, ప్రసాద్, నగేశ్, జంపన్న పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

దమ్మపేట, ఆగసుట 12: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దమ్మపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం పంచాయతీ కార్మికుల సమస్యలపై ఒక రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలతో పాటు మరికొన్ని సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష కార్యాచరణ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో యశోద, వెంకటమ్మలు పాల్గొన్నారు.

పాస్టర్లకు గొడుగులు పంపిణీ

సారపాక, ఆగస్టు 12: బూర్గంపహాడ్‌లోని బైబిల్ మిషన్ చర్చి ఆవరణలో బూర్గంపహాడ్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్లకు ఫెలోషిప్ అధ్యక్షుడు సీహెచ్.జాన్సన్ సోమవారం గొడుగులు పంపిణీ చేశారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 12: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సంఘం కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఫహీం అరుణపతాకాన్ని ఎగురవేశారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 12: కేరళ వయానాడు వరద బాధితులకు సింగరేణి కార్మికులు, ఉద్యోగులు అండగా నిలవడం అభినందనీయమని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కేరళ బాధితులకు విరాళాలు సేకరించారు.

చలమల స్మృతి వనం పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో కోటేశ్వరరావు

చండ్రుగొండ, ఆగస్టు 12: చండ్రుగొండ రేంజ్ పరిధిలోని చలమల శ్రీనివాసరావు స్మృతి వనం పనులను సోమవారం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు పరిశీలించారు. పోకలగూడెం బీట్ పరిధిలోని రావికంపాడు సెక్షన్ పరిధిలోని 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. చలమల స్మృతి వనంలో మొక్కలు నాటే కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. రేంజ్ అధికారి ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన మహిళకు ఆర్థిక సాయం

బూర్గంపహాడ్, ఆగస్టు 12: చర్ల మండలం మేడువాయి ఎస్సీ కాలనీకి చెందిన గద్దల లక్ష్మి రోడ్డు ప్రమాదంలో గాయపడింది. భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను బూర్గంపహాడ్ అంబేద్కర్ కాలనీ యూత్, ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించి వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందించారు. తోకల మోహనరావు, కేసుపాక సీతారాంబాబు, కేసుపాక క్రాంతికుమార్, కేసుపాక రామకృష్ణ, తోకల దుర్గాప్రసాద్ , పొట్టపింజర ప్రకాష్, కనుకు శ్రీనివాస్, బొక్కా రాంబాబు పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు

కరకగూడెం, ఆగస్టు 12: మండల వ్యాప్తంగా వరినాట్లు జోరందుకున్నాయి. జోరుగా నాట్లు వేస్తుండడంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. ఈ ఏడాది సకాలంలో నాట్లు పూర్తి చేసుకోనున్నట్లు రైతులు చర్చించుకుంటున్నారు. వర్షాకాలం పంటకు ఢోకాలేదని అన్ని చెరువులు పూర్తిగా నిండాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

బూర్గంపహాడ్, ఆగస్టు 12: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపజేశారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బేడా మండపంలో నిత్య కల్యాణాన్ని జరిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పూజలు చేస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 12: మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామికి సోమవారం ప్రత్యేక పూజలులు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు నివాళి

మృతుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

దుమ్ముగూడెం, ఆగస్టు 12: సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేనందున, తక్కువ వేతనాలతో పనిభారం ఎక్కువగా ఉండడంతో జూలైలో గుండెపోటు, ఇతర కారణాలతో నలుగురు సమగ్రశిక్ష ఉద్యోగులు మృతిచెందారు. సోమవారం లక్ష్మీనగరంలోని ఎంఆర్‌సీ భవనం వద్ద మృతులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జేఏసీ అధ్యక్షుడు భూక్యా మోహన్, ప్రధాన కార్యదర్శి బట్టు చంద్రలాల్, కోశాధికారి ఎన్ కిరణ్మయి సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, సాధ్యం కాని పక్షంలో మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, రూ.5లక్షలు ఆరోగ్యబీమా, రూ.10లక్షల జీవితబీమా, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.10లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు కాకా జయరావు, కొమరం ముద్దరాజు, కల్లూరు తులసీరామ్, దుర్గారావు, ఆశీర్వాదం, సతీశ్, రామలక్ష్మి, భవానీ, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, ఆగస్టు 12: సమగ్ర శిక్షా విభాగంలో గడిచిన నెల రోజుల్లో రాష్ట్రంలో మృతిచెందిన ఉద్యోగులకు సోమవారం ఎంఈవో కార్యాలయంలో ఎంఆర్‌సీ మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

పాల్వంచలో..

పాల్వంచ, ఆగస్టు 12: సమగ్రశిక్షా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు భూక్యా మోహన్, ప్రధాన కార్యదర్శి భట్టు చందర్‌లాల్ డిమాండ్ చేశారు. పాల్వంచ మండలం విద్యావనరుల కేంద్రంలో ఇటీవల సమగ్ర శిక్షాలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగులకు నివాళులర్పించారు.

బస్టాప్ వద్ద గుంతలు పూడ్చివేత

బోడు రోడ్డు సెంటర్ బస్ స్టాప్ వద్ద గుంతలు పూడ్చిన సిబ్బంది

టేకులపల్లి, ఆగస్టు 12: మండల కేంద్రంలోని బోడు రోడ్డు సెంటర్‌లో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో గుంతలను పూడ్చివేశారు. బస్ స్టాప్ వద్ద గుంతలు.. ఇబ్బంది పడుతున్న ప్రజలు అని నమస్తే తెలంగాణలో కథనం రావడంతో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో నీరు నిల్వ లేకుండా మరమ్మతులు చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు శ్రీనివాసరావు స్మృతివనం ప్రారంభం

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 12: గొత్తికోయల దాడిలో అసువులు బాసిన అటవీ అమరుడు చలమల శ్రీనివాసరావు జ్ఞాపకార్థంగా 'శ్రీనివాసరావు స్మృతివనం' ప్రారంభించనున్నట్లు జిల్లా అటవీ అధికారి కిష్టాగౌడ్ సోమవారం తెలిపారు. మంగళవారం జరిగే ప్రారంభోత్సవానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, అటవీ ముఖ్య సంరక్షణాధికారి బీమా నాయక్ పాల్గొంటారని, చర్ల్రుగొండ పట్టణం నుంచి స్మృతివనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి స్మారక స్థూపం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

రైల్వేలైన్ మంజూరు పట్ల హర్షం

సారపాక, ఆగస్టు 12: కేంద్ర ప్రభుత్వం బూర్గంపహాడ్ మండలం పాండురంగాపురం నుంచి మల్కాన్‌గిరి ఒరిస్సా రాష్ట్రానికి 173.63 కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్ రూ.4150 కోట్లతో ఆమోదం తెలిపినందుకు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాండురంగాపురం రైల్వేస్టేషన్ వద్ద మోదీ ప్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి.. పరిస్థితి విషమం

సారపాక/బూర్గంపహాడ్, ఆగస్టు 12: నిద్రిస్తున్న వ్యక్తిపై గొడ్డలితో దాడిచేసిన ఘటన మండల పరిధిలోని బత్తులనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీ బత్తులనగర్‌కు చెందిన మడివి సీతయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన కారం వెంకటేష్ సీతయ్యపై గొడ్డలితో దాడిచేశాడు. దీంతో సీతయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి వెంకటేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. పత్తి చేనులో ఉన్న సోదరుడు దూలయ్య, కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి సీతయ్యను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే సీతయ్య పరిస్థితి విషమంగా ఉందని ఏరియా ఆసుపత్రి వైద్యులు తెలిపారు. దూలయ్య బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై రాజేష్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

సారపాక, ఆగస్టు 12: గోదావరి నదిలో దూకి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పాఠకులకు విధితమే. ఈ నెల 5న మధ్యాహ్నం సారపాక మేడేకాలనీకి చెందిన భూక్యా శైలజ(20) కుటుంబ కలహాల నేపథ్యంలో సారపాక-భద్రాచలం బ్రిడ్జి వద్దకు వెళ్లి గోదావరి నదిలో దూకింది. అయితే బూర్గంపహాడ్ పోలీసులు, కుటుంబసభ్యులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా శైలజ ఆచూకీ లభించలేదు. ఎ